### పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి



నెలల తరబడిగా మధ్యాహ్న భోజనం బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క పాఠశాలలో ఏజెన్సీలకు రూ.3లక్షల నుంచి 4లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. రూ.3 వడ్డీకి అప్పు తెచ్చి వండి పెడుతున్నాం. కొంతమంది బంగారం తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చుకుంటున్నారు. గౌరవ వేతనం కూడా రావడం లేదు. పెండింగ్ బకాయిలు చెల్లించకుంటే ఈ నెల 24న ధర్నా చేసే ఆలోచనలో ఉన్నాం.

**-వై.స్వప్న, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు**

### ఈ-కుబేర్‌లో పెండింగ్



కొన్ని నెలలకు సంబంధించి మధ్యాహ్న భోజనం బిల్లులను చెల్లించాల్సి ఉన్నది. బకాయి కారణంగా మధ్యాహ్న భోజనం నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతున్నాం. బిల్లులు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. ఏ సమయంలోనైనా విడుదలయ్యే అవకాశం ఉన్నది. ఏజెన్సీలు ఆందోళన చెందవద్దు.

**- సుశీంధర్‌రావు, రంగారెడ్డి డీఈవో**

నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 20 జూన్ 2024 | RANGAREDDY

## నేడు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

బొంరాస్‌పేట, జూన్ 19 : చిన్న పిల్లలతో పాటు యువత అనారోగ్యానికి కారణమవుతున్న నులి పురుగులను నివారించడానికి ఏటా రెండుసార్లు జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని పాటిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒకసారి నులి పురుగుల నివారణ దినం నిర్వహించగా, గురువారం రెండోసారి నిర్వహిస్తున్నారు. నులి పురుగుల నివారణకు 1-19 సంవత్సరాల వయస్సు వారికి అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తారు. 1 నుంచి 2 ఏండ్ల వయసున్న వారికి సగం మాత్ర, 2-19 ఏండ్ల వయసున్న వారికి ఒక మాత్రను వేయాలి. మాత్రల పంపిణీపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పటికే సిబ్బందికి అవగాహన కల్పించారు. గురువారం మాత్రలు పంపిణీ చేయని వారికి ఈ నెల 27వ తేదీన మాప్అప్ ప్రోగ్రాం పేరుతో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారు.



బొంరాస్‌పేటలో మాత్రల పంపిణీపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు



# మధ్యాహ్న భోజన బకాయిలు రూ.4కోట్లు

- నెలల తరబడి బిల్లులు విడుదల చేయని ప్రభుత్వం
- పెరిగిన కూరగాయలు, గుడ్ల ధరలతో అవస్థలు
- నిర్వహణ భారంతో ఇబ్బందులు పడుతున్న ఏజెన్సీలు
- బంగారం తాకట్టు పెట్టి వండి పెడుతున్నామంటున్న కార్మికులు
- ధర్నా చేసే ఆలోచనలో ఏజెన్సీల నిర్వాహకులు


**మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సంబంధించిన బిల్లులు నెలల తరబడిగా పెండింగ్‌లో ఉన్నాయి. ఫలితంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతున్నది. పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలకు తోడు పేరుకుపోయిన బకాయిలతో పథకం నిర్వహణ ఏజెన్సీలకు ఆర్థికంగా భారంగా మారింది. రంగారెడ్డి జిల్లాలో పెండింగ్ బకాయిలు రూ.4కోట్ల వరకు ఏజెన్సీలకు రావాల్సి ఉన్నది. అప్పులు తెచ్చి విద్యార్థులకు వండి పెడుతున్నామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులను చెల్లించని పక్షంలో ధర్నా చేసే ఆలోచన చేస్తున్నట్లు ఏజెన్సీల మహిళలు పేర్కొంటున్నారు.**

**-రంగారెడ్డి, జూన్ 19(నమస్తే తెలంగాణ**

రంగారెడ్డి జిల్లాలో 1,271 పాఠశాలలు ఉండగా.. వీటిల్లో లక్షా యాభైవేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకాన్ని 908 మహిళా ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి. అయితే సకాలంలో బిల్లులు రాక ఏజెన్సీలకు పథకం నిర్వహణ కష్టంగా మారుతున్నది. 9, 10 తరగతుల విద్యార్థులకు సంబంధించిన బిల్లులు గత ఏడాది డిసెంబర్ నుంచి రూ.1,16,811,360 బకాయిలు పేరుకుపోయాయి. కోడి గుడ్లకు సంబంధించి మరో రూ.1,36,56,928 పెండింగ్ బిల్లులు గత డిసెంబర్ నుంచి విడుదల కావాల్సి ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం గత ఏడాది అట్టహాసంగా ప్రారంభించిన బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం అటకెక్కించింది. కొంతకాలంపాటు ఈ పథకాన్ని ఏజెన్సీలు నిర్వహించగా.. అందుకు సంబంధించిన రూ.85,24,512 బకాయిలు అలాగే ఉండిపోయాయి. 1 నుంచి 8తరగతులకు సంబంధించి బకాయిలు సైతం పెద్ద మొత్తంలో ఉండగా.. ఇటీవలనే చెల్లింపులు జరిగినట్లు తెలిసింది. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బకాయిలు పెద్ద మొత్తంలో రావాల్సి ఉండగా.. నూతన విద్యా సంవత్సరం ఆరంభమైనా ఇంకా విడుదల కాలేదు. దీనికితోడు ఏజెన్సీలకు ప్రభుత్వం ఇచ్చే రూ.2 వేల గౌరవ వేతనం సైతం ఆగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల హామీలో గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని.. పెంచిన వేతనం మాటేమోగానీ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పెంచిన వేతనాన్ని సైతం ఇవ్వడంలేదని ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆరు నెలల్లో.. ఆగమాగం

**నిరంతర వెలుగుల నుంచి అంధకారం వైపునకు..**





### కేసీఆర్ పాలనలో నిరంతర విద్యుత్తు



పదేండ్ల కేసీఆర్ పాలనలో నిరంతర విద్యుత్తు అందింది. రాష్ట్రం ఏర్పడక ముందు కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితులు ఉండేవి. వ్యాపారానికి కూడా చాలా ఇబ్బందిగా ఉండేది. కేసీఆర్ పాలనలో విద్యుత్తు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజలకు మేలు చేసిండు.

**-రవి, వ్యాపారి, షాద్‌నగర్‌టౌన్**

### వ్యవసాయానికి ఇబ్బంది లేకుండే



తెలంగాణ రాక ముందు కరెంట్ సమస్య తీవ్రంగా ఉండేది. కరెంట్ ఎప్పుడొస్తదో, ఎప్పడు పోతదో తెలిసేదికాదు. దీంతో పొలాల వద్ద పడిగాపులు కాసే వాళ్లం. రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ పుణ్యాన కరెంట్ కష్టాలు తీరాయి. నిరంతర కరెంట్‌తో రైతులందరూ సంతోషంగా వ్యవసాయం చేసుకున్నారు.

**- రమేశ్‌యాదవ్, రైతు, సోలిపూర్, షాద్‌నగర్‌టౌన్**

### 8 గంటల కోత విధిస్తున్నారు



గతంలో బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు వ్యవసాయానికి 24గంటలూ కరెంటు ఇచ్చేవారు. ఎప్పుడు మోటర్ ఆన్‌చేసినా పోసేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక త్రిఫేజ్ కరెంటులో 8 గంటలు కోత విధిస్తున్నారు. దీంతో పొలం పారడం లేదు. కేసీఆర్ హయాంలో నిరంతర విద్యుత్తుతో దర్జాగా పంటలు పండించుకున్నాం.

**- బ్రహ్మానందారెడ్డి, రైతు ఉప్పరిగూడ**

### కేసీఆర్ పాలనలోనే రైతులకు మేలు..



కేసీఆర్ హయాంలోనే రైతులకు మేలు జరిగింది. అప్పుడు వ్యవసాయానికి 24 గంటలూ కరెంట్ అందేది. కాంగ్రెస్ పాలనతో కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు సాయం, ఎరువులు సకాలంలో అందేవి. గృహాలకూ నిరంతర కరెంట్ అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది.

**- వీరయ్య, రైతు, ముర్తూజపల్లి, ఆమనగల్లు**

### కేసీఆర్‌తోనే వ్యవసాయం పండుగైంది..



స్వరాష్ట్రానికి ముందు దండుగన్న వ్యవసాయం కేసీఆర్ పాలనలోనే పండుగలా మారింది. 24గంటల నాణ్యమైన కరెంట్, పెట్టుబడి సాయం, రైతు బీమా వంటి పథకాలతో రైతుకే మేలు చేసిండు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా ఆయన పాలన సాగింది. కాంగ్రెస్ కక్షపూరిత ధోరణితో కరెంట్ విషయంలో కేసీఆర్‌ను తప్పు పట్టడం సరికాదు.

**-గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్, షాబాద్ మండలం**

తెలంగాణ రాక ముందు గందరగోళంగా ఉన్న విద్యుత్ రంగాన్ని కేసీఆర్ ప్రభుత్వం అద్భుతంగా తీర్చిదిద్దితే..ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ కరెంటు కష్టాలతో కన్నీరు పెట్టిస్తున్నదని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కృషితో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగిందని..రైతులు, వ్యాపారులు అన్ని వర్గాలు ఎంతో సంతోషంగా ఉన్నామని నాటి రోజులు గుర్తు చేసుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరునెలలు గడువక ముందే వేళాపాళా లేని విద్యుత్ కోతలతో నానా కష్టాలు పెడుతున్నారని వాపోతున్నారు. ఒక పక్క ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పక్కదోవ పట్టించడానికి విద్యుత్ రంగంలో అద్భుతాలు సృష్టించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చేస్తున్న ప్రయత్నాలు ఎవ్వరూ నమ్మడం లేదు. విద్యుత్ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పల్లెపల్లెలో కొత్త వెలుగులు నింపిన కేసీఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అస్తవ్యస్తమైన విద్యుత్ వ్యవస్థను సరిదిద్దకుండా తమ వైఫల్యాలను పాత ప్రభుత్వంపై నెడుతున్న కాంగ్రెస్ వైఖరిపై అన్ని వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన దిద్దుబాటుచర్యలు చేపట్టి విద్యుత్ సరఫరా మెరుగు పరచాలని డిమాండ్ చేస్తున్నారు.

### స్వరాష్ట్రంలో విద్యుత్తు సమస్య తొలిగింది



తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కృషితోనే విద్యుత్తు సమస్య తొలిగింది. 2014 సంవత్సరానికి ముందు గంటల తరబడి విద్యుత్తు నిలిచిపోయేది. స్వరాష్ట్రంలో కేసీఆర్ పరిశ్రమలు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు సరఫరా చేశారు. విద్యుత్తు విషయమై కేసీఆర్‌ను బద్నాం చేయడం సరికాదు.

**- వెంకటేశ్, ట్రాక్టర్ ట్రాలీ తయారీదారు, మన్నెగూడ, పూడూరు**

### నాణ్యమైన విద్యుత్తు అందేది..



2014 వరకు విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు, గృహోపకరణాలు దగ్ధమయ్యేవి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రత్యేక చొరవ తీసుకొని నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందేలా చూశారు. అలాంటి నేతపై కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నది. ఇప్పటికైనా ఈ కుతంత్రాలు మానుకొని నాణ్యమైన విద్యుత్తు సరఫరాపై దృష్టి పెట్టాలి.

**-కమ్మరి నాగప్ప, మిట్టకోడూర్, పరిగి మండలం**

### కాంగ్రెస్ సర్కార్‌ది కక్షపూరిత ధోరణి..



వ్యవసాయానికి నిర్విరామంగా ఉచిత కరెంటు ఇచ్చిన కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరిత ధోరణి అవలంబిస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ అంధకారమవుతుందన్న సమైక్య నేతలకు కేసీఆర్ నిరంతర విద్యుత్తు సరఫరా చేసి షాకిచ్చాడు. కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తే ఉద్యమిస్తాం.

**- జోగు గుణవర్ధన్ ముదిరాజ్, మల్లెపల్లి గ్రామం, దోమ**

# ఉపాధిలో పండ్ల తోటల సాగు



- చిన్న, సన్నకారు రైతుల ఆర్థిక వృద్ధే లక్ష్యంగా నిర్ణయం
- జిల్లావ్యాప్తంగా 900 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యం
- ఇప్పటివరకు పండ్ల తోటలు పెంచేందుకు 636 ఎకరాలు గుర్తింపు
- జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 410 మంది అర్హులైన రైతుల గుర్తింపు
- 12 రకాల పండ్ల తోటల సాగుకు ప్లాన్
- రైతులకు రూపాయి ఖర్చు లేకుండా వంద శాతం సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం
- ఉద్యానవన శాఖ ద్వారా మైక్రో ఇరిగేషన్ లోనూ 100 శాతం సబ్సిడీ...

వికారాబాద్, జూన్ 19, (నమస్తే తెలంగాణ): జిల్లాలోని చిన్న, సన్నకారు రైతుల ఆర్థిక వృద్ధే లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో పండ్ల తోటలను పెంచేందుకు నిర్ణయించింది. అయితే జిల్లాలో పండ్ల తోటలను పెంచేందుకు ఈ ఆర్థిక సంవత్సరానికిగాను టార్గెట్‌ను నిర్దేశించింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అర్హులైన రైతులను గుర్తించే పనిలో నిమగ్నమైంది. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర చిన్న, సన్నకారు రైతులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే పండ్ల తోటలను సాగు చేసేందుకు అధికారులు వంద శాతం సబ్సిడీని అందిస్తున్నారు. అయితే పండ్ల తోటల పెంపకానికి గుంతలు తీయడం మొదలు.. మొక్కలు నాటడం, ఊత కర్ర కట్టడం, మొక్కలు కొనుగోలుకు, ఎరువులు వేయడానికి, నెల నెలా పర్యవేక్షణ ఈ విధంగా మూడేండ్ల వరకు వంద శాతం సబ్సిడీని ఉపాధి హామీ ద్వారా ఇవ్వనున్నారు. మున్సిపాలిటీలు మినహా గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. అయితే జిల్లావ్యాప్తంగా 900 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 50 శాతానికిపైగా గుర్తింపు ప్రక్రియ పూర్తికాగా, వారం, పది రోజుల్లో రైతుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు చేస్తున్నది. పండ్ల తోటల పెంపకంలోనే కాకుండా మైక్రో ఇరిగేషన్‌కు కూడా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో వంద శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్‌ను పండ్ల తోటల్లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అయితే గతేడాది నిధులు లేకపోవడంతో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేయలేకపోయారు. మరి ఈ ఏడాది గుర్తించిన రైతుల పండ్ల తోటలకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తారా లేదనేది నిర్ణయించాల్సి ఉన్నది. మరోవైపు పండ్ల తోటల పెంపకానికి అర్హులైన రైతులు స్థానిక ఎంపీడీవో లేదా ఏపీవోలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

### ఇప్పటివరకు 636 ఎకరాలు గుర్తింపు...

జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి సంబంధించి అర్హులైన రైతులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ప్రకారం జిల్లాలోని అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే జిల్లావ్యాప్తంగా 900 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచేందుకు లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 636 ఎకరాలకు సంబంధించి అర్హులైన రైతులను గుర్తించారు. దరఖాస్తు చేసుకున్న రైతుల్లో అర్హులను ఎంపిక చేస్తున్నారు. ఇప్పటివరకు గుర్తించిన రైతులకు సంబంధించి.. బంట్వారం మండలంలో 11 మంది రైతులు 33 ఎకరాలు, బషీరాబాద్‌లో 6 మంది రైతులకు సంబంధించిన 10 ఎకరాలు, బొంరాస్‌పేటలో 21 మంది రైతులు 41 ఎకరాలు, ధారూరు మండలంలో 29 మంది రైతులు 38 ఎకరాలు, దోమ మండలంలో 16 మంది రైతులు 33 ఎకరాలు, దౌల్తాబాద్ మండలంలో 8 మంది రైతులు 20 ఎకరాలు, కొడంగల్ మండలంలో 10 మంది రైతులు 26 ఎకరాలు, కోట్‌పల్లి మండలంలో 20 మంది రైతులు 22 ఎకరాలు, కులకచర్ల మండలంలో 32 మంది రైతులు 76 ఎకరాలు, మర్పల్లి మండలంలో 16 మంది రైతులు 25 ఎకరాలు, మోమిన్‌పేట మండలంలో 38 మంది రైతులు 38 ఎకరాలు, నవాబ్‌పేట మండలంలో 60 మంది రైతులు 50 ఎకరాలు, పరిగి మండలంలో 19 మంది రైతులు 34 ఎకరాలు, పెద్దేముల్ మండలంలో 26 మంది రైతులు 55 ఎకరాలు, పూడూరు మండలంలో 23 మంది రైతులు 35 ఎకరాలు, తాండూరు మండలంలో 12 మంది రైతులు 30 ఎకరాలు, వికారాబాద్ మండలంలో 42 మంది రైతులు 51 ఎకరాలు, యాలాల్ మండలంలో 21 రైతులకు చెందిన 22 ఎకరాలను జిల్లా యంత్రాంగం ఇప్పటివరకు గుర్తించింది.

### అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలి - డీఆర్‌డీవో శ్రీనివాస్

పండ్ల తోటల పెంపకానికి సంబంధించి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మరోవైపు వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం నిర్ణయించిందని, అంతేకాకుండా మైక్రో ఇరిగేషన్‌కు కూడా ఉద్యానవన శాఖ ద్వారా వంద శాతం సబ్సిడీని అందిస్తుందన్నారు. వీలైనంతా త్వరితగతిన అర్హులైన రైతులను గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తామని డీఆర్‌డీవో తెలిపారు. ఇప్పటికే గుర్తించిన భూముల్లో గుంతలు తీసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు శ్రీనివాస్ వెల్లడించారు.

### 12 రకాల పండ్ల తోటల పెంపకం...

ఆయా జిల్లాల్లో నేలల స్వభావాన్ని బట్టి పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 12 రకాల పండ్ల తోటలను పెంచేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. జిల్లాలో చాలా వరకు ఎర్ర, నల్లరేగడి నేలలున్న దృష్ట్యా మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, ఆయిల్ పామ్, బత్తాయి, అల్లనేరేడు పండ్ల తోటలను పెంచేందుకు నిర్ణయించారు.

### అర్హులు వీరే...

పండ్ల తోటల పెంపకానికి సంబంధించి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర చిన్న, సన్నకారు రైతులను అర్హులుగా నిర్ణయించింది. అయితే 5 ఎకరాలలోపు భూమిగల రైతులను ఈ పథకానికి ఎంపిక చేస్తున్నారు. కుటుంబంలోని సభ్యుల భూమి మొత్తం ఐదెకరాలలోపు ఉండాల్సి ఉంటుంది. అదేవిధంగా ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండాలని, బోరు బావి కలిగి విద్యుత్తు సదుపాయం ఉన్నవారికి ఈ పథకం కింద జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ యంత్రాంగం గుర్తిస్తున్నది. మరోవైపు అర్హులైన రైతులు రైతు దరఖాస్తు పత్రం, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ కాపీలతోపాటు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సంబంధిత గ్రామ పంచాయతీ తీర్మానం తీసుకొని గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో లేదా ఏపీవోలకు సమర్పించాల్సి ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

## పనులు వేగవంతం చేయాలి

- ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలి
- కాలేజీల నిర్మాణానికి భూ సేకరణ చేపట్టాలి
- అధికారులను ఆదేశించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 19 : కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై నారాయణపేట్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలన్నారు. మంజూరైన పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రోడ్ల విస్తరణకు సంబంధించి పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. వివిధ కాలేజీల నిర్మాణం నిమిత్తం భూసేకరణ చేపట్టాలని, ఆ విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొడంగల్‌లో నిర్మించే అతిథి గృహానికి సంబంధించి నమూనాను రూపొందించి టెండర్లు పిలవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల నిర్మాణాల నమూనాలు, వైద్యుల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. గృహ జ్యోతి పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువనున్న పేద కుటుంబాలకు విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించే దిశగా పనిచేయాలన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణానికి అవసరమైన నిధుల నిమిత్తం ప్రతిపాదనలు పంపాలన్నారు. మంజూరైన చెక్ డ్యాంల పనులపై, అటవీ శాఖ భూముల్లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. కొడంగల్ నియోజకవర్గానికి వసతి గృహాల నిర్మాణాలకై స్థల సేకరణ చేపట్టి వివిధ సంక్షేమ శాఖలకు కేటాయించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తాండూరు ఆర్డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### బొకేలు, శాలువాలు వద్దు..

తనను కలువడానికి వచ్చేవారు బొకేలు, శాలువాలకు బదులుగా పెన్నులు, పుస్తకాలు తేవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోటు పుస్తకాలు, పెన్నులు ఇతర స్టేషనరీతో రావాలని కోరారు. అప్పుడే పేద విద్యార్థులకు సహాయం చేసినట్లు ఉంటుందని పేర్కొన్నారు.